మా రూట్‌లోనూ బస్సు నడపండి..

- కొత్త రూట్లకు పెరుగుతున్న డిమాండ్
- ఇటీవల చెట్టుపల్లి మార్గానికి మోక్షం
- ఇంకొన్ని ప్రాంతాలపై వినతులు



చెట్టుపల్లికి బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం, అధికారులు (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపో నుంచి కొత్త రూట్లలో సర్వీస్‌లు నడిపించాలని ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఆర్టీసీ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. అయితే ఆర్టీసీని ఆదరించే రూట్లలో బస్‌లు నడిపించాలని యోచిస్తున్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ గట్టెక్కించాలంటూ ఆదరణ కలిగిన నూతన రూట్లలో బస్‌లు నడిపించాలని సమలోచనలు చేస్తోంది. ఇప్పటికే పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్ష మేరకు గుండాల మండలం చెట్టుపల్లి కొమరారం మీదుగా ఇల్లెందుకు బస్సు సర్వీస్‌కు మోక్షం కలిగింది. ఇక ఇల్లెందు - మాణిక్యారం - కొమరారం మధ్య సర్వీస్ కోసం బోయితండా పంచాయతీ నుంచి మహిళలు తరలి వచ్చి ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతి అందజేసిన విషయం విధితమే. వీటితో పాటు నూతన రూట్లలో బస్ సర్వీస్‌లు ప్రవేశపెట్టాలని ఆర్టీసీ పరిశీలన చేస్తోంది. ఇల్లెందు- బోడు - టేకులపల్లి మీదుగా ఒక సర్వీస్ రోజుకు రెండుసార్లు నడిపించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఇల్లెందు- ముత్యాలంపాడు, ఇల్లెందు - చీమలపాడు - ఏన్కూర్ వరకు ఒక సర్వీస్, ఇల్లెందు - కారేపల్లి - డోర్నకల్, ఇల్లెందు - పాఖాల కొత్తగూడ, ఇల్లెందు- మాధారం- కారేపల్లిలకు బస్సు సర్వీస్‌లు నడిపించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి.

కొత్త సర్వీస్‌లు ఇలా..

ఇల్లెందు డిపో నుంచి కొమురారం - చెట్టుపల్లికి ప్రతీరోజు రెండు సర్వీస్‌లు నడిచేలా ఏర్పాటు చేశారు. ఇల్లెందు బస్ స్టేషన్ నుంచి ఉదయం 6.45 గంటలకు బయలు దేరిన బస్సు మర్రిగూడెం మీదుగా గుండాల వెళ్లి తిరుగు పయనంలో వయా చెట్టుపల్లి మీదుగా ఇల్లెందు చేరుకుంటుంది. మరో సర్వీస్ మధ్యాహ్నం 3 గంటలకు ఇల్లెందు- చెట్టుపల్లి - గుండాల వెళ్లి తిరుగు పయనం వయా మర్రిగూడెం మీదుగా ఇల్లెందుకు చేరుకుంటుంది.

బస్ ఎరుగని పల్లెలు.. ఇల్లెందు డిపో పరిధిలో ఎర్ర బస్సు ఎరుగని పల్లెలు ఉన్నాయి. పక్కా రోడ్లు ఉన్నా బస్సులు తిరగటం లేదు. ప్రజలు ఆటోలు, జీపులు, టాటా ఏసీ వాహనాలను రవాణా సాధనాలుగా మలుచుకున్నారు. రూ.కోట్లు కుమ్మరించి రోడ్లు నిర్మించారు. ఇలాంటి గ్రామాలకు బస్సులు నడవడం లేదు. ఇల్లెందు - ధనియాలపాడుకు పక్కా రోడ్డు సౌకర్యం ఉంది. మాణిక్యారం - కొమరారం, ఇల్లెందు - ధర్మాపురం, టేకులపల్లి - బోడు - ఇల్లెందు - మర్రిగూడెం కలుపుతూ బీటీ రోడ్డు ఉంది. ఇల్లెందు - కారేపల్లి మీదుగా డోర్నకల్ రోడ్డు ఉంది. ఇందులో చాలా గ్రామాలకు బస్సులు నడిచాయి. కామేపల్లి వయా ఊట్కూరు మీదుగా ఖమ్మానికి బస్సు సర్వీసు ఉండేది.



ఇల్లెందు - మాణిక్యారం బీటీ రోడ్డు

డిపో ఏర్పాటుతో ఆశలు..

ఇల్లెందులో బస్సు డిపో ఏర్పాటుతో కొత్త రూట్లకు బస్సులు నడిపే అవకాశం ఉంది. ఇల్లెందు బస్సు స్టేషన్‌లో ఐదు ప్లాట్ ఫారాలతో 46 వాణిజ్య సముదాయాలతో, ఏడు డీఓటీ స్టాల్స్, ఐదు పక్కా గదులు, 34 ఓపెన్ స్పేస్‌లతో నెలకు రూ.2.21 లక్షల ఆదాయం సమకూరుతోంది. నిత్యం 196 బస్సు సర్వీసులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇల్లెందులో 23 బస్సులు సుమారు 180 మంది వరకు సిబ్బంది పని చేస్తున్నారు.

మాణిక్యారం - కొమరారం బస్సు నడిపించాలి..

ఇల్లెందులో రోజుకు రెండుసార్లు మాణిక్యారం - కొమరారం మీదుగా బస్సు సర్వీస్‌లు నడిపించాలి. బస్సు రావటం వల్ల విద్యార్థులకు, వృద్ధులు, మహిళలు, రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రజలు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు బస్సు సర్వీసులు నడిపించేలా ఆర్టీసీ అధికారులకు సూచన చేయాలని వినతిపత్రం కూడా ఇచ్చాం. కానీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం వినియోగించుకోలేకపోతున్నం.

– రమేష్, తుంటిబాలు తండా

ఒక్కో రూట్‌కు బస్సు నడిపిస్తున్నాం..



ప్రజల నుంచి బస్సు సర్వీసులు కావాలని వినతులు వస్తున్నాయి. ప్రస్తుతం చెట్టుపల్లి టచ్ చేస్తూ రోజుకు రెండు సర్వీస్‌లు బస్సు నడిపిస్తున్నాము. ప్రజల నుంచి ఆదరణ ఉంటే కొత్త రూట్లలో బస్సులు నడుస్తాయి. సత్తుపల్లి సర్వీస్‌కు ఆదరణ లేకపోవటం వల్ల ఇల్లెందు - మహబూబాబాద్ - ఇల్లెందు - కొత్తగూడెం రోజుకు మూడు సర్వీస్‌లు నడిపిస్తున్నాము. మణుగూరు సర్వీస్‌కు ఆదరణ బావుంది.

– ఎం.దేవెందర్‌గౌడ్, డీఎం, కొత్తగూడెం

క్లుప్తంగా

ఇందిరమ్మ అమృత మిల్లెట్ చిక్కీ పంపిణీ



చిక్కీ పంపిణీ చేస్తున్న సీడీపీఓ అరుణ

ఇల్లెందు: పోషకాలు నిండిన ఇందిరమ్మ అమృత మిల్లెట్ చిక్కీని ప్రతీ బాలిక తీసుకోవాలని సీడీపీఓ అరుణ కోరారు. బుధవారం ఇల్లెందులోని 15వ వార్డు వెంగళరావునగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 14 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు మిల్లెట్ చిక్కీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ... బాలికలు మిల్లెట్ తీసుకోవడం ద్వారా పోషకాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోహిణీ, అంగన్‌వాడీ టీచర్ శారద, ఆయా రజిత, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

సింగరేణి సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజుకు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...

పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు పని వద్ద అవసరమైన రెండు జతల దుస్తులు, గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కార్మికులకు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జీఎం మీ సమస్యలను సంస్థ ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారమార్గం చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న పూర్ణచందర్‌రావు

పాల్వంచరూరల్: రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు కోరారు. రంగాపురం గ్రామంలో బుధవారం సీపీఐ గ్రామశాఖ మహాసభ మాలోతు హరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలో పేరుకపోయిన సమస్యలను గుర్తించి ప్రజలను సమీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శాఖ సభ్యులందరూ పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. నూతన శాఖ కార్యదర్శిగా ఎం.హరి, సహాయ కార్యదర్శిగా బానోతు హతీరామ్, తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సభలో నిమ్మల రాంబాబు, చంద్రు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



జూలూరుపాడు: హాజరైన వ్యాపారులు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

జూలూరుపాడు: నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. బుధవారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జూలూరుపాడు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విత్తన, ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విత్తనాలు ఇచ్చేటప్పుడు రైతుల సంతకాలు తీసుకొని రసీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు ఎక్కడ కన్పించరాదని, రైతులు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తారో ఆ వివరాలు నమోదు చేసుకొని ఇవ్వాలని చెప్పారు. విత్తనాలను డోర్ డెలివరీ చేయరాదని, స్టాక్ బోర్డులో వివరాలు నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు. రైతులు తప్పని సరిగా లైసెన్స్ కల్గిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బాదావత్ రవి, డీలర్ల సంఘం జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, ఆళ్ల మధుబాబు, ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రైతులకు నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. మండలంలోని కొమరారం గ్రామంలో విత్తన, ఎరువులు, పురుగు మందుల విక్రయదారులతో బుధవారం డీఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆమోదించిన బ్రాండెడ్ విత్తనాలను, నిర్దేశించిన ధరలలో మాత్రమే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎవరు విక్రయించినా వెంటనే తమకు సమచారం ఇవ్వాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తామని, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహిళలకు రుణాలు అందజేయండి..

ఇల్లెందు: సీపీఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య మహాసభ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా నాయకురాలు చంద్రకళ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలంటే స్వయం ఉపాధి రుణాలు అందించాలని కోరారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనకతార, మేరి పద్మ, సుమతి, సోనీ, చంద్రావతి, బంధం లక్ష్మి, అరుణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన బి.రాజ్ కుమార్ కుటుంబానికి తోటి గార్డులు రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. బుధవారం ఎస్ఓటూ జీఎం రామస్వామి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు.

గత నెల 21న గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, రామ్మూర్తి, రాందాస్ తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపి వేయండి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఆదివాసీలపై హత్యాకాండను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని శాంతి చర్చల కమిటీ కోరింది. బుధవారం ఇల్లెందులోని రామ్‌దేవ్ బాబా మందిరం ఫంక్షన్ హాల్‌లో జరిగిన శాంతి చర్చల కమిటీ సమావేశంలో ఎన్డీ రాష్ట్ర నాయకులు కె.విశ్వనాథ్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రసాదన్న మాట్లాడుతూ... తక్షణం శాంతి చర్చలు జరపాలని కోరారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల మీద మారణ హోమం నిలిపి వేయాలని కోరారు. ఈ సమావేశంలో బుర్ర ఆనంద్, బానోతు ఊక్లా, మల్లేషం, సదానందం, మదార్, రాంసింగ్, కోటమ్మ, మమత, గోపమ్మ, కొమరం సత్యనారాయణ, రామచంద్ర పాపారావు, పాపయ్య, వెంకన్న, బుజ్జయ్య, వెంకన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి..



జూలూరుపాడు: దరఖాస్తు వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



ఇల్లెందురూరల్: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

జూలూరుపాడు: భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జూలూరుపాడు తహసీల్దార్ టి.శ్రీనివాస్ అన్నారు. రెండోరోజు బుధవారం కరివారిగూడెం, గాంధీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఆదినారాయణ ఆధ్వర్యంలో భూ భారతి సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు అందజేసి, భూ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు. భూ రికార్డుల్లో పేర్లు తప్పులు, భూమి విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టాదారు పాసుపుస్తకం లేకపోవడం, ప్రభుత్వ భూముల నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూ సమస్యలు, భూసేకరణ కేసులు తదితర సమస్యల దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం ప్రకారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులు ఈనెల 20వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పాల్వంచ: భూసమ్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పాత పాల్వంచలో జరిగిన గ్రామ సదస్సులో దరఖాస్తుల విధానాన్ని కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ దారా ప్రసాద్, ఆర్ఐ ఎస్.రవికుమార్‌రెడ్డి, కొండం వెంకన్న, కందుకూరి రాము, కోటి నాయక్, కరీం, మధు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రెండోరోజు బుధవారం పాల్వంచ మండలంలో 470 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ దారా ప్రసాద్ తెలిపారు.

ఇల్లెందురూరల్: భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ కోట రవికుమార్ అన్నారు. బాలాజీనగర్, ఇందిరానగర్ గ్రామపంచాయతీలలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మాట్లాడుతూ.. అర్హత ఉండి పట్టాలు మంజూరు కానివారు, పట్టాదారు పాస్‌పుస్తకంలో తప్పులు నమోదైతే మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు.

పోడుపై గొత్తికోయలకు అవగాహన



గొత్తికోయలకు అవగాహన కల్పిస్తున్న అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు

చంచుపల్లి: రామవరం అటవీ రేంజ్ పరిధిలోని జగ్గారం, పాలవాగు గ్రామాల్లోని గొత్తికోయలకు బుధవారం అటవీ, రెవెన్యూ, పోలీసుశాఖల ఆధ్వర్యంలో పోడుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్తగూడెం ఫారెస్ట్ డివిజన్ అధికారి యు.కోటేశ్వరరావు గ్రామస్తులతో మాట్లాడుతూ... కొత్తగా పోడు కొట్టవద్దని సూచించారు. పర్యవేక్షణకు వచ్చే అటవీ అధికారులు, సిబ్బందిపై దాడులకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధులకు ఆటంకం కలిగిస్తే పోలీసులు కేసులు పెడతామని తెలిపారు. జగ్గారం, పాలవాగు ప్రాంతాల్లోని అటవీ భూముల జోలికి రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.కృష్ణ, టూ టౌన్ సీఐ ప్రతాప్, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓ సులూజ, అటవీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియా పరిధిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకాల్లో రామవరం ఏడు వార్డుల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణను ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణి కార్పొరేట్ అంతర్భాగమైన రామవరంలో గతంలో నాలుగు గనులలో బొగ్గు ఉత్పత్తి జరిగేదని, సింగరేణి హెడ్డాఫీసు ఏర్పడిన సమయంలోనే రామవరం ఏర్పాటైందని, ఈ నేపథ్యంలో కేవలం కార్పొరేట్ ఏరియాలోని నిరుద్యోగులకు అవకాశం కల్పించి రామవరం వారికి ఇవ్వకపోవడం గర్హనీయమన్నారు. జీఎంకు వినతిపత్రం అందించిన వారిలో కంచర్ల జమలయ్య, ఎస్కే ఫహీమ్ దాదా, భుక్యా శ్రీను, గుగులోత్ నగేష్, దబ్బేటి వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... 12 ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ రేషన్ కార్డుల జారీలో జాప్యం చేస్తోందన్నారు. వర్షాకాలం దృష్ట్యా మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి అందిస్తామని ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో రేషన్ కార్డులు లేని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భూక్యా చరణ్, రాంబాబు, గణేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- తొలగించాలని మంత్రి, కలెక్టర్ ఆదేశించినా బేఖాతర్
- విద్యుత్ తీగల కిందే నిర్మాణాలు జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లు



పూబెల్లి గ్రామంలో విద్యుత్ లైన్ కింద ఇంటి నిర్మాణాలు

ఇల్లెందురూరల్: ఇప్పటి వరకు పూరిగుడిసెలలో ఉన్న ఆదివాసీలకు ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాలేదు. కొంత ఎత్తుగా ఇళ్లు నిర్మిస్తే ఇంటి పైభాగానికి అతిసమీపంలో విద్యుత్ తీగలు వేలాడే పరిస్థితి ఉంటుంది. దీంతో స్తంభాలను ఇళ్లకు దూరంగా మార్చాలని ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే సమయం నుంచి గ్రామస్థులు స్థానిక అధికారులకు విన్నవిస్తూ వచ్చారు. సమస్యను పరిష్కరించాలని మార్చి 16న ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన సమయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పూబెల్లి గ్రామస్తులు విన్నవించారు. అదే సమయంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్వయంగా పరిశీలించి తొలగింపునకు తక్షణం చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించేందుకు ఏప్రిల్ 27న ఎమ్మెల్యే కోరం కనకయ్య పూబెల్లి గ్రామాన్ని సందర్శించిన సమయంలోనూ స్థానికులు ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను చూపించారు. రెండు సందర్భాలలోనూ విద్యుత్ స్తంభాల మార్పు కోసం గ్రామం నుంచి ఒకరి పేరుతో తమకు వినతిపత్రం అందజేయాలని పంచాయతీ అధికారులను ట్రాన్స్‌కో అధికారులు కోరారు. కానీ నేటికీ వినతిపత్రం ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో విద్యుత్ తీగల తొలగింపు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. దీంతో హైటెన్షన్ విద్యుత్ తీగల కింది భాగంలోనే ప్రమాదకరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావును వివరణ కోరగా.. విద్యుత్ స్తంభాల మార్పు కోసం అయ్యే ఖర్చును అంచనా వేయాలి. దీనిప్రకారం స్తంభాల మార్పు కోసం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ సాగేందుకు తమకు గ్రామంలో ఒకరి పేరుమీద వినతిపత్రం ఇవ్వాలని పంచాయతీ అధికారులను పలుమార్లు కోరాం. ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదని చెప్పారు.

నీటి కొరతను అధిగమించేలా..

- వర్షపు నీటిని ఒడిసి పట్టాలి
- శరవేగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణం





పాపకొల్లులో నీటి కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఇన్‌సెట్) భేతాళపాడులో ఇంకుడు గుంత వద్ద లబ్ధిదారుడు

జూలూరుపాడు: వర్షపు నీరు వృథా కాకుండా వడిసి పట్టేలా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. వర్షపు నీటి వినియోగం ద్వారా భూగర్భ జలాలను భద్రపరచడం, భవిష్యత్‌లో నీటి కొరతను నివారించడానికి ప్రభుత్వం ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలను చేపట్టింది. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాలతో జూలూరుపాడు మండలంలో ఎంపీడీఓ కరణాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఇంకుడు గుంతలు, నీటి కుంటల పనులు చేపట్టారు. ఈజీఎస్ ఏపీఓ రవికుమార్ ఆధ్వర్యంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని నీటిని భూగర్భంలోకి పంపించడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. ఈ ప్రక్రియతో వేసవికాలంలో నీటి కొరతను నివారించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల ప్రాంగణాలు, పల్లపు భూముల్లో, బోరు బావుల సమీపంలో, చేతి పంపులు వద్ద, రహదారుల పక్కన, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వనాలు, ప్రతీ ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, రహదారుల పక్కన నిర్మించే ఇంకుడు గుంతల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న వారికి ఇంకుడు గుంతను మంజూరు చేసి, నిర్మాణం పూర్తయితే రూ 6,000 ఇస్తున్నారు. వర్షపు నీటిని సమర్ధవంతంగా నిలుపుకోవడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ పంటల సాగు కోసం నీటి కుంటలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ కుంటల్లో చేపల పెంపకాన్ని కూడా చేపట్టవచ్చు. అదేవిధంగా మత్స్యశాఖ సబ్సిడీపై చేపపిల్లలను అందజేయనుంది. రైతులు వ్యవసాయ పొలాల్లో నీటి కుంటలు నిర్మించుకుంటున్నారు. నీటి కుంట నిర్మాణానికి ఈజీఎస్ నిధులు రూ.3 లక్షలు మంజూరు చేస్తారు. నీటి కుంట (ఫారమ్ పాండ్) నిర్మాణ పనులను ఉపాధి కూలీలతో చేయిస్తారు. జూలూరుపాడు మండలంలో వినోభానగర్, అన్నారుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం, గాంధీనగర్, అనంతారం, గుండెపుడి గ్రామాల్లో 11 మంది రైతులు వ్యవసాయ పొలాల్లో నీటి కుంటల నిర్మాణం జరుగుతోంది. నీటి కుంటల నిర్మాణం పూర్తి అయితే వ్యవసాయ పంటలకు సాగు నీరు అందుబాటులోకి వస్తుంది. ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు, రైతులకు అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు అవగాహన కల్పిస్తున్నారు.

భూగర్భ జలాల పరిరక్షణలో భాగస్వాములు కావాలి..



భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలి. రైతులు పంటల సాగు నీటి అవసరాల కోసం మోటార్లు, బోర్లను అధిక ఖర్చుతో ఉపయోగించడాన్ని నివారించేందుకు నీటి కుంటలు ఎంతో దోహదపడతాయి. ప్రతీ రైతు వ్యవసాయ పొలాల్లో నీటి కుంట నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. అదేవిధంగా ప్రతి ఇంటి ప్రాంగణంలో తప్పని సరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. భవిష్యత్ నీటి భద్రతకు ఇంకుడు గుంతలు, నీటి కుంటలు ఉపయోగపడతాయి.

– డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, జూలూరుపాడు